క్లుప్తంగా

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఆలిండియా దళిత రైట్స్ ఫోరం ప్రతినిధులు

సీతమ్మధార : మణిపూర్ హింసా కాండను నిరసిస్తూ విశాఖపట్నం ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు నేరుగా కలుగజేసుకొని దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం పై నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా ఏకతాటి పైకి వచ్చి ఇటువంటి చర్యలను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు పట్టా రమేష్, మచ్చ కోటేశ్వరరావు, జి.జగ్జీవన్‌రావు, వి.గోవిందరాజు, పి.లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'గోబడ్డీ' యాప్‌తో ఉద్యోగ అవకాశాలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: గోబడ్డీ యాప్ ద్వారా నిరుద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పంచాద నరసింహారావు, రాజు గౌడ్ తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం రాజుగౌడ్ మాట్లాడుతూ గోబడ్డీ యాప్ ద్వారా ప్లంబర్, కార్పెంటర్, పెయింటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్, డ్రైవర్స్ వంటి సేవలు అందిస్తోందన్నారు. విశాఖతో పాటు అనకాపల్లి, కాకినాడ, విజయనగరం జిల్లాలకు సేవలను విస్తరించినట్లు తెలిపారు.

అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన

ఎంవీపీ కాలనీ: అణ్వస్త్ర రహిత ప్రపంచం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బాలవికాస్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం(ఐఏఆర్ఎఫ్) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు బుధవారం ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఈ సమావేశాలు జరగనున్నాయని ప్రతినిధులు తెలిపారు.

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మణ సహిత సీతారాములు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఇందులో భాగంగా బుధవారం అష్టోత్తర కలశాభిషేకం, పుష్పయాగం కార్యక్రమాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లు చెదిరే.. 'కళా'రూపాలు

- అద్భుత సృజన కనబరుస్తున్న ఉపాధ్యాయిని సూర్యకళ
- లిమ్కా బుక్‌లో నమోదే ధ్యేయమని వెల్లడి



సుద్దలతో చేసిన రూపాలు



కంచరపాలెం : ప్రపంచంలో పనికి రానిదంటూ ఏ వస్తువూ లేదని నిరూపిస్తుంటారు కొందరు. వారి కోవలోనే నిరూపిస్తున్నారు మహిళా ఉపాధ్యాయిని సూర్యకళ. అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్నారు మహాకవి శ్రీశ్రీ. అదే స్ఫూర్తితో తన కళా నైపుణ్యాన్ని చాటుతున్నారు సూర్యకళ. సుద్దముక్కలు, గాజుసీసాలు, పనికిరాని వస్తువులకు ప్రాణం పోస్తున్నారు. ఏముందిలే అని విసిరి పారేయకుండా.. వాటితో ఏం చేస్తే బాగుంటుందో అని ఆలోచించి సృజన జోడించి కళా ఖండాలుగా మారుస్తున్నారు. వివిధ ఆకృతుల్లో మలిచి ఔరా అనిపిస్తున్నారు. అభిరుచి, ఆసక్తి, ఓపిక ఉండాలే గాని కళారంగంలో రాణించవచ్చని చాటుతున్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

కళలకు ప్రాముఖ్యత..

పాట్ పెయింటింగ్, సారీ పెయింటింగ్, డ్రాయింగ్, కృత్రిమ పూలు, కొవ్వొత్తులతో వస్తువులు, బీఈడీ విద్యార్థులకు మోడల్స్ తయారు చేయడం ఈమె ప్రత్యేకత, వీటితో పాటు పిల్లలకు నృత్యాలు, నాటికలు వేయడంలోనూ తర్ఫీదు ఇస్తారు. 0.4 మిల్లీమీటర్ల పరిమాణంలో వినాయక విగ్రహాన్ని సుద్దముక్క, పెన్సిల్ ముళ్లపై, మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రతిమను సుద్దముక్కతో రూపుదిద్దడం చూపరులను ఆకట్టుకున్నాయి. అతిసూక్ష్మ రూపంలో కళా ఖండాలు చేయాలని, ఎవరూ తయారు చేయలేని వస్తువులకు రూపునిచ్చి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డు సాధించాలన్నది తన ధ్యేయమని సూర్యకళ వెల్లడించారు.

ఉపాధ్యాయినిగా 'కళా'రూపాలు..

జ్ఞానాపురానికి చెందిన సూర్యకళ 1997వ సంవత్సరం నుంచి పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతూ మరో వైపు వివిధ కళాకృతులను రూపొందిస్తున్నారు. పాఠశాలలో పాఠ్యాంశాలు బోధించిన తర్వాత ఖాళీ సమయాల్లో వీటిని తయారు చేయడం నేర్చుకున్నాని సూర్యకళ తెలిపారు.

నూట యాభైకు మించి కళాఖండాలు..

ఇప్పటి వరకు ఆమె ఎన్నో కళాకృతులు రూపొందించారు. వీటిలో మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, మదర్‌థెరిసా, గాంధీజీ వంటి నాయకులతో పాటు రాధాకృష్ణ, వినాయకుడు, క్రీస్తు, విశ్వామిత్ర, కార్తికేయ, వెంకన్న, శివ వంటి దేవతామూర్తుల ఆకట్టుకునే బొమ్మలకు ప్రాణం పోశారు. చూపరులకు నచ్చి బాగున్నాయని చాలా మంది వాటిని తీసుకెళ్లారని ఆమె తెలిపారు.







యశోద చిన్నికృష్ణుడు, బిడ్డను ముద్దాడుతున్న తల్లి, సుద్దలతో తెలుగు వర్ణమాల

అలరించిన కవి సమ్మేళనం



మాట్లాడుతున్న రచయిత కె.జి.వేణు

సీతంపేట : సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం సాయంత్రం నిర్వహించిన కవి సమ్మేళనం ఆహూతులను అలరించింది. సభాధ్యక్షుడు, రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ కవిత్వం కాలానుగుణంగా మార్పు చెంది వివిధ ప్రక్రియల్లో సామాజిక చైతన్యం దిశగా పయనిస్తుందన్నారు. యువ కవులు ఆ రీతిగా సాహిత్యాన్ని కవితామయం చేశారన్నారు. ఈ సందర్భంగా రచయిత రమణ గురించి ప్రసంగించారు. పత్రికా రంగంలోనూ, సినిమా రంగంలోనూ రమణ విశిష్ట సేవలందించారని గుర్తు చేశారు. అతను రచించిన మిథునం ప్రఖ్యాతి గాంచిందని, గుత్తు వంకాయ కూర, రమణ పేరడీలు అలరించాయన్నారు. అనంతరం సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, చిన సూర్యనారాయణ, మూర్తి, జి.కె.సుబ్రహ్మణ్యం, రాధారాణి, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ కవితలు చదివి వినిపించారు.

కార్పొరేటర్ పూర్ణిమ ఔదార్యం



చిన్నారావు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం మాన్యువల్ స్ట్రీట్‌లో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొలగాని చిన్నారావు మంగళవారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ మంగళవారం అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు చిన్నారావు కుటుంబ సభ్యులకు అందజేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుంచి వైఎస్సార్ బీమా త్వరితగతిన అందేటట్లు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మామిడి మోహన్, కమల్‌కుమార్, పిల్లి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 49వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శంకరరావు

మురళీనగర్: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. 49వ వార్డులో నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు సమక్షంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. విశాఖ నగరాన్ని ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని వివరించారు. నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు అన్ని ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రజావసరాల దృష్ట్యా అంగన్‌వాడీ, సామాజిక భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 49వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సుమారు రూ.3.06 కోట్ల నిధులతో ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్, మాణిక్యాంబ కాలనీ, సత్యానగర్, బర్మా కాలనీ, సూర్యానగర్ ప్రాంతాల్లో నిర్మించనున్న బీటీ రోడ్డు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులను మేయర్, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు ప్రారంభించారు. సూర్యానగర్–1లో రూ.28 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ, సామాజిక భవనానికి కేకే రాజు ప్రారంభోత్సవం చేశారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 51వ వార్డు కార్పొరేటరు రెయ్యి వెంకటరమణ, 49వ వార్డు నాయకులు, సచివాలయం కన్వీనర్లు, కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధిలోని సూర్యానగర్, బిర్లా కూడలి 11కేవీ ఫీడర్ల ఇంటర్ లింకింగ్ లైన్స్, ఇతర నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సూర్యానగర్, ఎంకే గార్డెన్స్, సత్యానగర్, సాయిరామ్‌నగర్, ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఏరియా, సింగరాయిమెట్ట, పాత్రా ఇండియా, సుందరం మోటార్స్ ప్రాంతం, బంక్ వీధి, బిర్లా కూడలి, డీమార్ట్ ప్రాంతం, రామాలయం వీధి, రోజా డిపార్టుమెంట్, శ్రీదేవి పార్కు, బృందావనం పార్కు ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

– మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని గ్రీన్‌గార్డెన్స్, ఎఫ్‌సీఐ 11కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పార్వతీనగర్, హాస్పిస్‌నగర్, పంజాబ్‌హోటల్ కూడలి, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్, భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ కాలనీ, ఆంధ్రకేసరి నగర్, శ్రీహర్ష నగర్, భారత్ పెట్రోలియం బంక్ ఏరియా, ఏపిల్ పార్కు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్

సీతమ్మధార: భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను నాలుగో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 45వ వార్డు గురునాథ్ కాలనీలో అల్లు రాము, శారదా దంపతులు నివసిస్తున్నారు. వీరికి 2016లో వివాహమైంది. పాప, బాబు ఉన్నారు. రాము నావెల్ డాక్‌యార్డులో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యాడు. దీంతో కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2022 డిసెంబర్‌లో రాముపై భార్య శారదా ఫిర్యాదు మేరకు 498ఏ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం మద్యం కోసం రాము డబ్బులు అడగటంతో శారదా లేవని చెప్పింది. దీంతో పక్కనే ఉన్న కత్తితో ఆమెను గాయపర్చాడు. స్థానికులు ఆమెను 108లో ఆస్పత్రికి తరలించారు. శారదా ఫిర్యాదు మేరకు రామును పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ గౌరి కేసు నమోదు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్‌లో పూజా రుసుం చెల్లించాలి. వివరాలకు 89855 15989 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆలయ అధికారులు కోరారు.

ఏయూ సమాచారం..

భావ నైపుణ్యాలు ప్రధానం



చంద్రమోహన్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించే విద్యార్థులు భావ నైపుణ్యాలు కలిగి ఉండాలని తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య ఎ.చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రాంగణంలో 'విజయవంతమైన పారిశ్రామికవేత్తలు, నాయకుల లక్షణాలు' అంశంపై ఆయన మాట్లాడారు. వ్యక్తి విజయాల్లో కమ్యూనికేషన్ అనేది ఎంతో ముఖ్య భూమిక పోషిస్తుందని చెప్పారు. నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా ఎదగడానికి భావ ప్రసార నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. వినడం, మాట్లాడటం, రాయడం ఈ మూడు లక్షణాలు నాయకత్వానికి మూల స్తంభాలుగా నిలుస్తాయని, వీటిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సారబంది, ఆచార్య కె.కె.చాంద్ కోలవెన్ను, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆచార్య చంద్రమోహన్‌ను సత్కరించారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను వర్సిటీ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు బుధవారం పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న బీఈడీ పరీక్షలను స్వయంగా తనిఖీ చేశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆర్ట్స్ కళాశాలలోని విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, తరగతులు జరుగుతున్న విధానం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళనం రేపు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు శ్రీనివాసరావు

సీతంపేట: శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని తన ఇంటి వద్ద బుధవారం ఉదయం ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో సుమారు నాలుగున్నర లక్షల మంది శెట్టి బలిజలు ఉన్నారని, వారందర్నీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేలా ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. శెట్టిబలిజ సంఘం నాయకుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్తులు, ఉన్నత హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వైద్యాధికారులు కడలి సత్యవరప్రసాద్, కముజు నరసింహారెడ్డి, యాండ్ర రాంప్రసాద్, యాండ్ర లక్ష్మీ నరసింగరావు, చెల్లుబోయిన మంగ వెంకట్‌లను సత్కరిస్తామన్నారు. నగరంలోని శెట్టి బలిజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కడలి సుబ్బారావు, కేతా గంగరాజు, కడలి శివ కేశవ నరసింహారావు, వాసర్ల బాలకృష్ణ, గుత్తుల వెంకటేశ్వరరావు, నరాల బాలకృష్ణ, గుత్తుల సుబ్రహ్మణ్యం, గుత్తుల రాజశేఖర్, కట్టా శ్రీకాంత్, మామిడిశెట్టి రామకృష్ణమూర్తి, రాయుడు శివరామ కృష్ణ పాల్గొన్నారు.

మధురానగర్‌లో గెడ్డ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న సీసీపీ సునీత

సీతంపేట: జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సీసీపీ సునీత అధికారులతో కలిసి బుధవారం ఉదయం స్థానిక మధురానగర్ గెడ్డ వద్ద విలువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ గెడ్డ వద్ద విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా పరిరక్షించాలంటూ 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ స్పందనలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలు పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు చేపడతానని, అప్పటి వరకు నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశించారు. గతంలో చిన్న రూమ్ ఉండేదని, దానిని పడగొట్టి పిల్లర్లు వేసి పక్కా ఇళ్లు నిర్మిస్తున్నట్టు ఏసీపీ శాస్త్రి తెలిపారు. పక్కనే ఉన్న గెడ్డ బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నట్టు గతంలో గుర్తించామన్నారు. దీనిని సరిచేసుకుని, ప్లాన్ సమర్పించాలని గతంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆదేశించినా నిర్మాణదారులు స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీపీవో తేజ, ప్లానింగ్ సెక్రటరీ కృష్ణ పాల్గొన్నారు.

కోలా గురువులుకు అభినందన



వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో కోలా గురువులును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కె.కె.రాజు

డాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ గౌరవం.. గుర్తింపు ఉంటాయని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కోలా గురువులు బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే గురువులును సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి 16 ఫిషింగ్ హార్బర్లు, 4 పోర్టుల నిర్మాణం, 11 ఫిషింగ్ స్టేషన్లు, చేపల వేట నిషేధ సమయంలో రూ.4 వేల భృతిని రూ.10 వేలకు పెంచిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

వేడుకగా ఫ్రెంచ్ భాషా వారోత్సవాలు



విద్యార్థినులతో ముఖ్య అతిథి మేరీ ఏంజిల్ బసేస్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఫ్రెంచ్ జాతీయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఫ్రెంచ్ భాష ఆచార్య సిస్టర్ జైన్ నేతృత్వంలో ఫ్రెంచ్ గీతాలాపన, అభినయం, నృత్యాలు, సంస్కృతి పట్ల అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహించారు. తమ కళాశాల ప్రారంభం నుంచి ఫ్రెంచ్‌ను ద్వితీయ భాషగా నేర్పిస్తున్నట్లు విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు.

ముఖ్య అతిథిగా మేరీ ఏంజిల్ బసేస్ హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఫ్రెంచ్ భాష గొప్పదనాన్ని వివరించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసంతో పాటు మేధో వికాసం పెరుగుతుందన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముక్త, చైత్ర, దీపిక, హర్షిత సాన, దీవెన, సాయిగీత, ఆధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల డీడీలు వెనక్కి



టిడ్కో లబ్ధిదారులకు డీడీలు వాపసు చేస్తున్న కంపా హనోకు. చిత్రంలో పైడిరమణ

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెంలో గత ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాల కోసం కట్టించుకున్న డీడీలను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కంపా హనోకు చేతుల మీదుగా లబ్ధిదారులకు వెనక్కి ఇచ్చేసారు. ఈ ప్రాంతంలో టిడ్కో ఇళ్ల కోసం గత ప్రభుత్వం లబ్ధిదారుల నుంచి డీడీలు కట్టించుకుంది. కానీ వారికి ఇళ్లు కేటాయించలేదు. కానీ జగన్ మోహనరెడ్డి కేవలం ఒక్క రూపాయికే టిడ్కో ఇళ్లను అర్హులకు అందజేశారు. దీంతో ఆ డీడీలను తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు, ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడిరమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, నేపాల్‌శ్రీను, ముప్పిడి రామారావు, నాయుడు, వార్డు సీవో రమణి, ఆర్పీలు పాల్గొన్నారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ డైరెక్టర్ కోటేశ్వరరావు

మర్రిపాలెం: సచివాలయ సేవలను మరింత విస్తృతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్ పి.కోటేశ్వరరావు సూచించారు. జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ నగర్ సచివాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, యూజర్ చార్జీల వసూళ్లు, ఇంటింటికీ చెత్త సేకరణ, స్పందన ఫిర్యాదులు, తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. సచివాలయంలో పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.